సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం। 19। జనవరి। 2023

అభివాదం చేస్తున్న సీఎంలు కేసీఆర్, విజయన్, మాన్, కేజ్రీవాల్, మాజీ సీఎం అఖిలేశ్, సీపీఐ జాతీయ నేత రాజా తదితరులు



బీఆర్ఎస్‌లో జోష్ !

బహిరంగసభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు





సభ సక్సెస్‌తో శ్రేణుల్లో నూతనోత్సాహం

- భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు
- ఏకతాటిపై నేతల జన సమీకరణతో విజయవంతం
- కలిసొచ్చిన కమ్యూనిస్టు పార్టీలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్ఎస్ తొలి బహిరంగ సభ ఖమ్మం గుమ్మంలో సక్సెస్ అయింది. ఉమ్మడి జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావడంతో ఖమ్మం గులాబీ వనమైంది. రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. సభా ప్రాంగణమంతా కేసీఆర్ నినాదాలతో మార్మోగింది. నేతలంతా ఏకతాటిపైకి వచ్చి జన సమీకరణకు సర్వశక్తులొడ్డడంతో ఫలితం కనిపించింది. వీరికి కమ్యూనిస్టులు కూడా తోడవడంతో సభ నిండుగా కనిపించింది.

జాతరలా తరలివచ్చి..

ఆవిర్భావ సభ ప్రకటనతో పది రోజులుగా బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు జన సమీకరణకు సర్వశక్తులొడ్డారు. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ జన సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రణాళిక రూపొందించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, పాలేరు, మధిర, వైరా, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి కేడర్ జాతరలా తరలివచ్చింది. మిగితా నియోజకవర్గాల నుంచి కూడా ముఖ్య ప్రజాప్రతినిధులు కదిలారు. సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి వచ్చిన కేడర్‌తో సభా ప్రాంగణమంతా గులాబీ సంద్రమైంది.

నేతల్లో నూతనోత్సాహం..

ఈ ఏడాదే ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం నేపథ్యంలో ఖమ్మం వేదికగా జరిగిన బీఆర్ఎస్ తొలి సభ ఆ పార్టీ నేతల్లో జోష్ నింపింది. సభ సక్సెస్ కావడం, సీఎం కేసీఆర్ సంతృప్తి వ్యక్తం చేయడంతో నాయకుల శ్రమ ఫలించినట్లయింది. అంతేకాకుండా సభ సక్సెస్ అయిందంటూ ముఖ్యమంత్రి పలువురు నేతలకు ఫోన్‌లు చేసి అభినందించారు. ముఖ్యమంత్రి కూడా ఈ సభపై ప్రత్యేక దృష్టి పెట్టడం, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించడం, సీపీఐ, సీపీఎం నేతలు సైతం ఆవిర్భావ సభకు కలిసి రావడం.. వచ్చే ఎన్నికల్లో తమకు కలిసి వచ్చే అంశాలని ఆ పార్టీ నాయకత్వం అభిప్రాయం వ్యక్తం చేస్తోంది.

మూడోసారి అలా కావొద్దని..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2014, 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ ఒక్కో సీటు మాత్రమే దక్కించుకుంది. ఆ పార్టీ ఇప్పుడు బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందడం, తొలి సభకు ఖమ్మాన్ని వేదికగా ఎంచుకోవడం ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మకమేనని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే సీపీఎం, సీపీఐ నేతలు కూడా బీఆర్ఎస్‌తో కలిసి వెళ్తామని ఆవిర్భావ సభ వేదికగా ప్రకటించడం, మళ్లీ తమ సత్తా ఏమిటో చూపుతామని కమ్యూనిస్టు నేతలు చెప్పడంతో ఈ వేదిక రానున్న రాజకీయ తరుణానికి ప్రాధాన్యత సంతరించుకుంది. గత పరాభవాలను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టులతో కలిసి వెళ్లి ఉమ్మడి జిల్లాలో తమ ఆధిపత్యం చాటుకునేందుకు బీఆర్ఎస్‌కు ఈ సభ ఊతమిచ్చినట్లు అవుతుందని ఆ పార్టీ నాయకత్వం విశ్లేషిస్తోంది. బీఆర్ఎస్‌గా పార్టీ మారడంతో మూడోసారి ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టులతో వెళ్తే అప్రతిహత విజయమే తమకు ఉంటుందని, ఈ సారి ఎలాగైనా జిల్లా తమ వశమవుతుందన్న కోణంలోనే కేసీఆర్ ఈ సభకు ఖమ్మాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

ముందు వరుసలో మంత్రులు.. వెనుక నేతలు

బీఆర్ఎస్ ఆవిర్భావ సభ వేదికపై ముందు వరుసలో ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, సీపీఎం, సీపీఐ నేతలు, ఏపీ బీఆర్ఎస్ నేతలు ప్రొటోకాల్ ప్రకారం కూర్చున్నారు. అయితే ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఇదే వేదికపై పార్టీ నాయకత్వం ప్రకటించినట్లుగానే వెనుక వరుసలో కూర్చున్నారు. వీరు కాకుండా మిగితా ఎవరినీ నిర్వాహకులు రానివ్వలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, మాలోతు కవిత, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధుసూదన్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, లావుడ్యా రాములునాయక్, వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ, మాజీ ఎమ్మెల్యేలు బానోతు చంద్రావతి, జలగం వెంకట్రావు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ వేదికపై ఆశీనులయ్యారు.



బీఆర్ఎస్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, వేదికపై సీఎంలు, ఇతర నేతలు

ఇంగ్లిష్.. హిందీ.. తెలుగు

బీఆర్ఎస్ ఆవిర్భావ సభలో నలుగురు ముఖ్యమంత్రుల ప్రసంగం మూడు భాషల్లో సాగింది. కేరళ ముఖ్యమంత్రి విజయన్ ఇంగ్లిష్‌లో మాట్లాడగా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హిందీలో మాట్లాడారు. చివరకు సీఎం కేసీఆర్ తెలుగులో మాట్లాడారు. కేసీఆర్ ప్రసంగంలో అంతకు ముందు హిందీ, ఇంగ్లిష్‌లో చెప్పిన కొన్ని మాటలను కేడర్‌కు తెలుగులో వివరించారు. ఈ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షత వహించి.. ఒక్కో ముఖ్యఅతిథి ప్రస్థానం గురించి చెబుతూ వారిని ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారు. పినరయ్ విజయన్ తొలుత ఇంగ్లిష్‌లో మాట్లాడారు. ఆయన స్పీచ్ తర్వాత సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 'కొద్దిగ ఓపిక అవసరం మనకు. హిందీ, ఇంగ్లిష్ ఉపన్యాసాలు కూడా వినడం నేర్చుకోవాలి' అన్నారు. సభా వేదికపై మొత్తంగా ఎనిమిది మంది ప్రసంగించారు.

జిల్లాపై వరాల జల్లు

- జీపీలు, మున్సిపాలిటీలకు నిధులు
- జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల..
- మున్నేరుపై కొత్త బ్రిడ్జి కూడా

ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లాపై వరాల జల్లు కురిపించారు. గ్రామపంచాయతీలతో పాటు మున్సిపాలిటీలు, ఖమ్మం కార్పొరేషన్‌కు దండిగా నిధులు ప్రకటించారు. నూతన కలెక్టరేట్, కంటివెలుగును ప్రారంభించాక మెడికల్ కాలేజీ శిలాఫలకాన్ని ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, భగవంత్ సింగ్‌మాన్, పినరయి విజయన్, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో కలిసి ఆవిష్కరించారు. ఆ తర్వాత కలెక్టర్‌ను నూతన చాంబర్‌లో కూర్చోబెట్టి నలుగురు సీఎంలు అభినందించారు. అనంతరం సీఎం కేసీఆర్ ఇతర ముఖ్యమంత్రులతో కలిసి సభా వేదిక వద్దకు చేరుకున్నారు. సభలో కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

కొత్తగూడెం పోయి కేసీఆర్ చాలా వరాలు ఇచ్చిండు. ఖమ్మంలోనేమో జాతీయ పంచాయితీ పెట్టిండు.. మా సంగతి ఏంది అని మా సర్పంచ్‌లు అందరు అనుకుంటరు. జిల్లాలో ఇప్పుడు 589 పంచాయతీలున్నాయి. ప్రతి గ్రామపంచాయతీకి ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నా. ఖమ్మంరూరల్ మండలంలో ఉన్న పెద్దతండా, ఏదులాపురంతో పాటు కల్లూరు, తల్లాడ, నేలకొండపల్లి పంచాయతీలు 10వేల జనాభాకు మించి ఉన్నవి. అవి మున్సిపాలిటీలు కాకుండా మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్నవి. వీటికి తలా రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నాం. ఖమ్మం కార్పొరేషన్‌ను మంత్రి పువ్వాడ బాగా తీర్చిదిద్దాడు. అప్పుడు తుమ్మల ఉన్నప్పుడు కొంత కార్యక్రమం ప్రారంభమై.. ఆయన హయాంలో కొంత నడిచింది.. అదే స్ఫూర్తితో అజయ్ కూడా బాగా ముందుకు తీసుకెళ్తా ఉన్నారు. వెంకటవీరయ్య ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపాలిటీ, అలాగే ఇతర మున్సిపాలిటీలు మధిర, వైరా ఇవన్నీ అభివృద్ధి కావాల్సిన అవసరం ఉంది. ఖమ్మం మున్సిపాలిటీకి ప్రత్యేకంగా మరో రూ.50 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేస్తున్నా. అజయ్ నాకు పదే పదే చెబుతున్నారు. మున్నేరు నది మీద పాత బ్రిడ్జి ఉంది. దీన్ని రీప్లేస్ చేసి కొత్త బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. అది కూడా వెంటనే మంజూరు చేస్తున్నా. అదే విధంగా మధిర, వైరా, సతుపల్లి మున్సిపాలిటీలకు రూ.30 కోట్ల చొప్పున మంజూరు చేస్తున్నా. ఖమ్మంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కావాలని కూడా నాయకులు, మంత్రి అడుగుతున్నారు. తప్పకుండా జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజీని కొత్త కోర్సులతో మంజూరు చేస్తాం. ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి ఖమ్మం చరిత్రలోనే ఇంత అద్భుతమైన భారీ బహిరంగ సభకు తరలివచ్చిన నా ఆత్మీయ బంధువులు అందరికీ పేరు పేరునా ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు, నాకు చాలా ఆశ్చర్యం కలుగుతా ఉంది. మీకు భాష అర్థం కాకపోయినా.. చాలా చక్కగా ఇంత ఓపికగా మీ సమయం కోసం వేచి ఉన్నారంటేనే.. ఇది ఈ దేశంలో ప్రబలమైన మార్పుకు సంకేతమని నేను భావిస్తున్నా.

నెల రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..

జిల్లా అధికారులకు, జిల్లా మంత్రికి, ఆర్థిక మంత్రి హరీశ్‌రావుకు మనవి చేస్తున్నా.. ఖమ్మం హెడ్ క్వార్టర్‌లో ఎంతమంది జర్నలిస్టులున్నారో.. ప్రభుత్వ స్థలం ఉంటే సంతోషం లేకపోతే భూ సేకరణ చేసి ప్రతి ఒక్క జర్నలిస్ట్‌కు ఇళ్ల స్థలం నెలరోజుల్లో ఇవ్వాలి.

కట్టుదిట్టంగా పోలీసు భద్రత

- ఎక్కడికక్కడ వాహనాల మళ్లింపు
- రహదారులపైనే ఉన్నతాధికారులు



వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్న సీపీ వారియర్, అధికారులు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవం, బీఆర్ఎస్ బహిరంగ సభకు నాలుగు రాష్ట్రాల సీఎంలు, పార్టీల ముఖ్యనేతలు హాజరు కావడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు. ఖమ్మం పోలీసులతో పాటు టీఎస్ఎస్పీ బెటాలియన్లు, మహబూబాబాద్, కొత్తగూడెం, వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్, భూపాలపల్లి, జగిత్యాల, నిర్మల్, నల్లగొండ, కరీంనగర్ తదితర జిల్లాల నుండి సుమారు ఆరు వేల మంది పోలీసు బలగాలను మోహరించారు. ఐజీపీ షానవాజ్‌ఖాసిం, సీపీ విష్ణు ఎస్.వారియర్ నేతృత్వాన ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించడమే కాక పార్కింగ్, ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యాన జిల్లాకు వచ్చిన డీజీపీ అంజనీకుమార్‌ను సీపీ వారియర్ సహా అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన కలెక్టరేట్‌లో భద్రతా ఏర్పాట్లను డీజీపీ పరిశీలించారు. ఐజీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం, డీఐజీలు రంగనాథ్, రమేష్‌నాయుడు, చౌహాన్, పలువురు ఐపీఎస్ అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలిస్తూ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేశారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా...

బీఆర్ఎస్ మహాసభకు భారీగా జనం రావడంతో ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పర్యవేక్షించిన పోలీసులు విధుల్లో సఫలీకృతమయ్యారనే చెప్పొచ్చు. భద్రాచలంలో గోదావరి పుష్కరాల సమయాన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా బాధ్యతలు నిర్వర్తించిన అప్పటి సీపీ, ప్రస్తుత ఐజీపీ షాన్‌వాజ్ ఖాసింను రూట్ మ్యాప్ ఇంచార్జ్‌గా నియమించడంతో చేసిన ఏర్పాట్లు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. ఖాసింతో పాటు ఖమ్మం ఎస్పీగా అనుభవం ఉన్న వరంగల్ సీపీ రంగనాథ్ తదితరులు బాధ్యతలు పాలుపంచుకున్నారు. ఇక సీపీ వారియర్ సహా ఇతర అధికారులంతా ఉదయం నుంచి రాత్రి వాహనాలన్నీ ఖమ్మం దాటే వరకు రహదారులపైనే ఉండి పర్యవేక్షించడంతో ఎక్కడా అవాంతరాలు ఎదురుకాలేదు.

తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనివ్వం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



ఖమ్మం మయూరిసెంటర్: ఫాసిస్టు సిద్ధాంతాలు కలిగిన బీజేపీని తెలంగాణలో అడుగు పెట్టనిచ్చేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. కుల వ్యవస్థను రక్షించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆ పార్టీ.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తోందని ఆరోపించారు. కేసీఆర్ విధానాలు నచ్చినందునే బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీజేపీ తమను రెచ్చగొట్టిందని, దానికి సమాధానంగా ఆ పార్టీని ఓడించి చూపామని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ బీజేపీ అడుగు పెట్టకుండా చూస్తామని, ఎవరైనా ఆ పార్టీని మోయాలని చూస్తే వారికి బుద్ధిచెప్పే వరకు నిద్రపోమని అన్నారు. కాగా, జిల్లాలో సీతారామ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని, ఉమ్మడి జిల్లాలో గిరిజన యూనివర్సిటీతోపాటు ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్‌ను ఆయన కోరారు.

పరిశ్రమలను అమ్మేందుకు కుట్ర

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



ఖమ్మంమయూరిసెంటర్: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్న బీజేపీ ప్రభుత్వం 400 పరిశ్రమలను అమ్మేందుకు కుట్ర పన్నిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. దేశంలో ప్రభుత్వ ఆస్తులు, పరిశ్రమలను అమ్మే హక్కు బీజేపీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. మోడీ రాజనీతిజ్ఞుడనే అహంతో ఉన్నారన్నారు. దేశంలో ధరల పెరుగుదలకు మోడీ విధానాలే కారణమని అన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చి వేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోనూ ఎమ్మెల్యేల కొనుగోలు చేసేందుకు కుట్ర పన్నగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. నాజీలను మించిన బీజేపీని దేశం నుంచి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ఉద్యమాల ఖిల్లా ఖమ్మం కమ్యూనిస్టుల గుమ్మమని.. బీఆర్ఎస్, కమ్యూనిస్టులు కలిస్తే పదికి పది స్థానాలు విజయం సాధిస్తాయని కూనంనేని తెలిపారు.

మినిట్ టు మినిట్ ఇలా..



- యాదాద్రి మీదుగా తెలంగాణ సహా కేరళ, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు కేసీఆర్, విజయన్, కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్‌తో పాటు యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా రెండు హెలీకాప్టర్లలో ఖమ్మం వచ్చారు.
- మొదటి హెలీకాప్టర్‌లో కేసీఆర్, విజయన్, కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్ మధ్యాహ్నం 1: 32 గంటలకు దిగారు.
- రెండో హెలీకాప్టర్‌లో 1: 33 గంటలకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా వచ్చారు.
- హెలీప్యాడ్ల వద్ద వీరికి మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతకుమారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ స్వాగతం పలికారు.
- ప్రత్యేక బస్సులో 1:35గంటలకు కలెక్టరేట్ ఆవరణకు బయలుదేరారు.
- మధ్యాహ్నం 1:37గంటలకు బస్సు దిగాక పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.
- ఆ తర్వాత కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గుమ్మడికాయ కొట్టారు. అనంతరం సీఎంలు కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు మెడికల్ కళాశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.
- మధ్యాహ్నం 1:40గంటలకు కలెక్టర్ గౌతమ్ చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను నలుగురు సీఎంలు కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.
- మధ్యాహ్నం 2గంటలకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరుగురు లబ్ధిదారులకు కంటి అద్దాలు అందజేశారు.
- అక్కడి నుంచి మొదటి అంతస్తుకు వెళ్లి సీఎంలు మధ్యాహ్న భోజనం చేశారు.
- 2.45 గంటల నుంచి ప్రజాప్రతినిధులు విడతల వారీగా సభా ప్రాంగణానికి వచ్చారు.
- 3:11 గంటలకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని, తమ్మినేనిని మాట్లాడేందుకు ఆహ్వానించారు.
- మధ్యాహ్నం 3.25గంటలకు కలెక్టరేట్ నుంచి సభా ప్రాంగణానికి బయలుదేరిన సీఎంలు 3.31 గంటలకు చేరుకున్నారు.
- 3.34 గంటలకు బీఆర్ఎస్ బహిరంగ సభను సీఎం కేసీఆర్ అధ్యక్షతన ప్రారంభించారు.
- 3.35 గంటల నుంచి 3.56గంటలకు వరకు కేరళ సీఎం పినరయి విజయన్ ప్రసంగించారు.
- 3.59 నుంచి 4.12గంటల వరకు యూపీ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్ మాట్లాడారు.
- 4.14 నుంచి 4.28గంటల వరకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ప్రసంగించారు.
- 4.29 నుంచి 4.43 గంటల వరకు పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ మాట్లాడారు.
- 4.44 గంటల నుంచి 4.57వరకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రసంగించారు.
- సీఎం కేసీఆర్ 4.57 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి 5.33 గంటలకు మొత్తం 37 నిమిషాల పాటు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.
- కేసీఆర్ ప్రసంగం ముగిశాక అతిథులకు వెండివీణలు బహూకరించి సత్కరించారు.
- తన ప్రసంగం ముగిశాక సాయంత్రం 4–12గంటలకు కేరళ సీఎం పినరయి విజయన్ హెలీకాప్టర్‌లో విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లగా, ఆ హెలీకాప్టర్ తిరిగి ఖమ్మం వచ్చింది.
- సాయంత్రం 5–45గంటలకు సీఎంలు కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా బయలుదేరారు.

– ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం/ఖమ్మంమయూరిసెంటర్/వైరా

నాలుగున్నర గంటల వరకు ఖమ్మంలోనే సీఎంలు...

బీఆర్ఎస్ సభ, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రారంభోత్సవం సందర్భంగా నలుగురు ముఖ్యమంత్రులు, మరో మాజీ సీఎం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నాలుగున్నర గంటల వరకు ఖమ్మంలోనే ఉన్నారు. తొలుత మధ్యాహ్నం 1.30 గంటలకు రెండు హెలీకాప్టర్లలో నూతన కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇక్కడ కార్యక్రమాలను మధ్యాహ్నం 3.30 గంటల వరకు ముగించుకున్నారు. ఆ తర్వాత సభా వేదిక పైకి వచ్చి సాయంత్రం 5.30 గంటల వరకు వేదికపైనే ఉన్నారు. 5.45 గంటలకు హెలీకాప్టర్‌లో తమ గమ్యస్థానాలకు వెళ్లారు. అయితే 4.30 గంటల పాటు నలుగురు సీఎంలు, రాష్ట్రస్థాయి మంత్రులు, ముఖ్యనేతలు ఖమ్మం కేంద్రంగా పది కిలోమీటర్ల పరిధిలోనే ఉండటంతో బందోబస్తునంతా డీజీపీ అంజనీకుమార్ పరిశీలించారు. అలాగే సీఎస్ శాంతికుమారి కూడా ఇక్కడే ఉండి కలెక్టరేట్‌కు సంబంధించిన కార్యక్రమాలను దగ్గరుండి పరిశీలించారు.



కలెక్టరేట్‌ను ప్రారంభించాక పూజ చేస్తూ...



కంటివెలుగు లబ్ధిదారుడికి అద్దాలు అమరుస్తూ..



కలెక్టరేట్, మెడికల్ కాలేజీ శిలాఫలకాలను ఆవిష్కరించాక...


కల్లు ముంతతో ఎమ్మెల్సీ గోరటి

కల్లు రుచి చూసిన ఎమ్మెల్సీ గోరటి

కూసుమంచి: ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ సభకు వెళ్లి వస్తున్న క్రమంలో వాగ్గేయ కారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మార్గమధ్యలో కూసుమంచి మండలం నాయకన్ గూడెం వద్ద తాటికల్లు రుచి చూశారు. జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న ఆయన ఆ పక్కనే తాటిచెట్లు, గౌడలు కనిపించడంతో తన వాహనాన్ని ఆపారు. అప్పుడే చెట్టు ఎక్కి కల్లు తీసిన గీతకార్మికుడి వద్దకు వెళ్లి కల్లు రుచి చూశారు. అంతేకాక తనవెంట బాటిల్‌లో కల్లు తీసుకెళ్లారు.

మంత్రి తలసాని కాన్వాయ్ నుంచి పొగలు


వాహనానికి మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఖమ్మంక్రైం: జిల్లాకు వచ్చిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పైలట్ వాహనం నుంచి ఒక్కసారిగా పొగలే కాక పేలినట్లుగా భారీ శబ్దం రావడంతో పోలీస్ సిబ్బందితో పాటు ప్రజలు పరుగులు పెట్టారు. కలెక్టరేట్ ఆవరణలోకి మంత్రుల వాహనాలనే తప్ప ఎస్కార్ట్ వాహనాలను అనుమతించలేదు. దీంతో మంత్రి తలసాని కాన్వాయ్‌లోని వాహనాలను కలెక్టరేట్ గేటు పక్కన నిలిపారు. కాసేపటికి కాన్వాయ్‌లోని ఓ వాహనం నుంచి భారీ శబ్దం ఆ వెంటనే పొగలు రావటంతో అందులో కూర్చుని ఉన్న సిబ్బంది, పక్కనే ఉన్న పోలీసులు, ప్రజలు ఏం జరిగిందో తెలియక పరుగులు తీశారు. చివరకు ఏసీ కిట్ పేలినట్లు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత సిబ్బంది మరమ్మతులు చేశారు.


వాహనాల రాకపోకలు లేకపోవటంతో నడిచివెళ్తున్న వి.వెంకటాయపాలెం వాసులు


పల్లీలు అమ్మేవారిని ఓ చెట్టు కింద కట్టడి చేసిన పోలీసులు


ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభకు కదిలొచ్చిన గులాబీదండు

జనమా.. గులాబీ వనమా..

ఖమ్మం గుమ్మం బీఆర్ఎస్ శ్రేణులతో పోటెత్తింది. తొలి సభే గులాబీ వనాన్ని తలపించింది. నలుగురు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, వీఐపీలు తరలిరావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, కార్లు తదితర వాహనాలు రహదారుల వెంట బారులు తీరగా.. కార్యకర్తలు దండులా కదిలివచ్చారు. పలువురు అభిమానులు రకరకాల వేషధారణల్లో తరలివచ్చి ఆకట్టుకున్నారు. గిరిజనులు నృత్యాలతో అలరించారు.

–సాక్షి నెట్‌వర్క్


ర్యాలీగా వస్తున్న వీవీపాలెం వాసులు




సీఎంలు కేసీఆర్, విజయన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ గౌతమ్, మంత్రి పువ్వాడ అజయ్


సీఎంకు నమస్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్సీ కవిత


నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు


సంక్షేమ పథకాల ఫ్లెక్సీతో సిద్దిపేట అభిమాని


సభలో ఖమ్మం మహిళా కార్పొరేటర్లు


ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం కేసీఆర్


బుల్లెట్‌పై వచ్చిన హైదరాబాదీ జహీరుద్దీన్


వేదికపై ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యేలు హరిప్రియ, సండ్ర, వనమా, కందాళ తదితరులు


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్

క్లుప్తంగా

కిన్నెరసానిలో ట్రెయినీ ఐఎఫ్ఎస్ బృందం


బోటింగ్ చేస్తున్న ట్రెయినీ ఐఎఫ్ఎస్ అధికారులు

పాల్వంచరూరల్: కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని డెహ్రాడూన్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 32 మంది ఐఎఫ్ఎస్ అధికారులు బుధవారం సందర్శించారు. స్టడీటూర్‌లో భాగంగా కిన్నెరసానికి వచ్చిన వారు.. డీర్ పార్కులోని జింకలను వీక్షించి బోటు షికారు చేశారు. జంతువులు, అటవీ సంరక్షణ గురించి వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి వివరించారు. ట్రైనీస్ వెంట రేంజర్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం వాయిదా

దమ్మపేట: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఆత్మీయ సమ్మేళనం వాయిదా పడినట్లు పొంగులేటి వర్గీయుడు జారే ఆదినారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దమ్మపేటలో ఈనెల 20న సమావేశం నిర్వహించాలని నిర్ణయించామని, అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని చెప్పారు. నిర్వహణ తేదీని త్వరలో వెల్లడిస్తామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గోదావరి తీరంలో గుర్తించిన మృతదేహం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి బ్రిడ్జి మొదటి పిల్లర్ పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభించింది. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాల వరకు ఉంటుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన వ్యక్తిగా కొందరు స్థానికులు పోలీసులకు వివరించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలిస్తే టౌన్ సీఐ నాగరాజు రెడ్డికి 94407 95320 నంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బస్సుల్లేక ప్రయాణికుల గోస..

- జిల్లావ్యాప్తంగా బస్టాండ్లలో పండుగ రద్దీ
- బీఆర్ఎస్ సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో అవస్థ

చుంచుపల్లి: ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు బుధవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యాన సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరుగుముఖం పట్టారు. అయితే, ఖమ్మంలో బీఆర్ఎస్ సభ నేపథ్యాన ఆ పార్టీ నాయకులు ఖమ్మం రీజియన్ పరిధిలో 90 శాతం మేర బస్సులు అద్దెకు తీసుకున్నారు. దీంతో ఒక్క సూపర్ లగ్జరీ సర్వీసులు తప్ప మిగతా బస్సులన్నీ ఖమ్మం సభకు వెళ్లడంతో ఇతర రూట్లలో బస్సుల కొరత ఏర్పడింది. ఫలితంగా పిల్లాపాపలతో బస్టాండ్లకు వచ్చిన వారు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. బీఆర్ఎస్ సభకు పోగా మిగిలిన బస్సులను పల్లె ప్రాంతాలకు ఒకటి, అరా మాత్రమే నడిపి రెగ్యులర్ సర్వీసులన్నీ రద్దు చేశారు. ఎక్కువ బస్సులను హైదరాబాద్, తదితర మార్గాల్లో నడపడంతో మిగతా ప్రయాణికులు అవస్థ పడడం కనిపించింది.

బస్టాండ్ ప్రాంగణాల్లో ప్రయాణికుల రద్దీ

జిల్లా నుంచి పలు ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో పెద్దసంఖ్యలో చేరుకున్న ప్రయాణికులు పడిగాపులు కాశారు. ఒకటి, అరా బస్సులు వస్తున్నా సీట్లు లేక.. నిల్చోవడం సాధ్యం కాక చాలా మంది నిరాశ చెందారు. మరికొందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించగా ఇంకొందరు ఇంటిముఖం పట్టారు. కాగా, ప్రైవేట్ పాఠశాలల బస్సులను సైతం ఖమ్మం బహిరంగ సభ కోసం తీసుకోవడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రీజియన్‌లో బస్సుల కొరతతో నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, హైదరాబాద్ సిటీతో పాటు ఏపీలోని పలు డిపోల నుంచి బస్సులను అధికారులు తెప్పించారు. ప్రయాణికులు రోజంతా ఇబ్బంది పడుతున్నా అధికారులు కనీసం సమాచారం ఇవ్వడంలో విఫలమవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.


కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఉదయం నుంచి చూస్తున్నాం



మేము మధిర వెళ్లాలి. ఉదయం 9:30 గంటలకు కొత్తగూడెం బస్టాండ్‌కు రాగా ఒకటి, రెండు బస్సులు మాత్రమే నడిచాయి. అవి కూడా నిండిపోవడంతో గంటన్నరగా ఎదురుచూస్తున్నాం.

– వెంకటస్వామి, ప్రయాణికుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



తల్లాడకు వెళ్లాలని కొత్తగూడెం బస్టాండ్‌కు వచ్చి రెండు గంటలుగా వేచి చూస్తున్నాం.కానీ బస్సులు లేవు. ఖమ్మం వెళ్లే వారు చాలామంది ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– రేవంత్‌కుమార్, ప్రయాణికుడు

సూపర్ లగ్జరీలు తప్ప అన్నీ సభకే...



కొత్తగూడెం డిపోలో 68 బస్సులు ఉండగా, 48 బస్సులను సభకు బుక్ చేసుకున్నారు. అలాగే, మరికొన్ని కావాలనడంతో ఇతర డిపోల నుంచి తెప్పించాం. ఇక మిగిలిన 16 సూపర్ లగ్జరీ బస్సులను హైదరాబాద్, ఇల్లెందు, ఖమ్మం నడిపించాం.

– బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లకు పటిష్ట భద్రత..

సూపర్‌బజార్(కొత్తగూడెం): బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ పరికరాలను స్కాన్‌చేసి ఈవీఎం గోదాంలో భద్రపర్చనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ తెలిపారు. బుధవారం ఈసీఐఎల్ కంపెనీ నుంచి జిల్లాకు మూడు కంటైనర్లలో పంపిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిశిత పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఎన్నికల సంఘం 1976 బ్యాలెట్ యూనిట్లు, 1543 కంట్రోల్ యూనిట్లు పంపిందని పేర్కొన్నారు. వాటిని గోదాంలో పటిష్టమైన బందోబస్తుతో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం గోదాంను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకుడు ఎంఏ రాజు, సిబ్బంది నవీన్, రవీందర్(బీజేపీ), రాజశేఖర్(కాంగ్రెస్), వీరూ నాయక్(బీఎస్పీ), భూక్య రమేష్(సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.


యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ తదితరులు


కంటివెలుగుకు ఏర్పాట్లు పూర్తి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: జిల్లాలో నేటి నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. బుధవారం ఆయన ఆయా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి వెలుగు కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు 48 టీమ్‌లు పని చేస్తాయన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కార్యక్రమం ఉంటుందని, మారుమూల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి క్యాంపులకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. క్యాంపుల నిర్వహణను పరిశీలించేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని, ఎక్కడైనా సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్యాంపునకు వచ్చేవారు ఆధార్‌కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాగా, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిద్ధార్థ హైస్కూల్, పాల్వంచ సబ్ స్టేషన్, బూడిదగడ్డ క్యాంపుల్లో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కంటి వెలుగును ప్రారంభిస్తారు. ఇల్లెందులోని బాలాజీ నగర్ పాఠశాలలో ఎమ్మెల్యే హరిప్రియ, భద్రాచలం జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య, అశ్వారావుపేట రైతు శిక్షణ కేంద్రంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మణుగూరు కమ్యూనిటీ హాల్‌లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

'ఓఅండ్ఎం' ఇక కనుమరుగు..

- కాలం చెల్లిన కేటీపీఎస్ పాతప్లాంట్ కూల్చివేత
- పనులు ప్రారంభించిన హెచ్ఆర్ కమర్షియల్ లిమిటెడ్


నేలమట్టం కానున్న కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం

పాల్వంచ: సుమారు ఆరు దశాబ్దాలపాటు విద్యుత్ కాంతులు విరజిమ్మి, మూతపడ్డ కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారం ఇక నేలమట్టం కానుంది. కాలం చెల్లడంతో కర్మాగారం కూల్చివేత పనులు చేపట్టారు. పాల్వంచ కేంద్రంగా 1966లో కేటీపీఎస్ నిర్మాణం ప్రారంభించారు. 60, 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన యూనిట్లతో 1978 వరకు నాలుగు దశల్లో 720 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణం పూర్తి చేశారు. ఈ కర్మాగారానికి కాలం చెల్లడంతో సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2019 డిసెంబర్‌లో విద్యుదుత్పత్తిని నిలిపివేసింది. కర్మాగారంలోని వందల టన్నుల భారీ లోహ యంత్రాలను జెన్‌కో యాజమాన్యం తుక్కుగా విక్రయించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎంఎస్‌సీసీ కన్సల్టెన్సీ ద్వారా టెండర్లు పిలువగా ముంబైకి చెందిన హెచ్ఆర్ కమర్షియల్ లిమిటెడ్ సంస్థ రూ.485.05 కోట్లకు దక్కించుకుంది. బుధవారం కోల్ ప్లాంట్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కూల్చివేత పనులు ప్రారంభించారు.

32 నెలల్లో పనులు

32 నెలల్లోగా పాత ప్లాంట్‌లోని అన్ని విభాగాలను పూర్తిగా తొలగించనున్నారు. ఈ పనులను బుధవారం 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు, హెచ్ఆర్ కమర్షియల్ లిమిటెడ్ ప్రతినిధి వరుణ్ సింగ్లా ప్రారంభించారు. ఎస్ఈలు జీవీ. కిరణ్‌కుమార్, ఎస్.యుగపతి, గుర్రం రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ దుర్గా మల్లేశ్వరి, డీవైసీసీ నాగరాజు, డీఈ శేఖర్, ఏడీఈ వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ కర్మాగారం వేలాది మందికి ఉపాధి అందించడంతోపాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడిందని పేర్కొన్నారు.